సాక్షి తూర్పుగోదావరి


గురువారం । 28 । మార్చి । 2024



పరీక్షా కాలం

ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకూ వార్షిక పరీక్షలు ఏప్రిల్ 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

8లో



డెల్టాకు 8,970 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాలువలకు 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సా॥)	సెహరీ శుక్రవారం (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.39
కాకినాడ	6.24	4.39
అమలాపురం	6.24	4.39

న్యూస్‌రీల్

ముగిసిన పదో తరగతి పరీక్షలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిసాయి. చివరిరోజు సోషల్ పరీక్ష జరిగింది. ఈ మొత్తం 30 వేల 116 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుంది. వీరిలో 23,784 మంది రెగ్యులర్, 6,332 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. అయితే పరీక్షలకు 28,400 మంది విద్యార్థులు హాజరయ్యారు. 94.5 హాజరు శాతం నమోదైంది. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలను జిల్లా వ్యాప్తంగా 137 కేంద్రాలలో నిర్వహించారు. ఈ పరీక్షలకు 1,255 మంది ఇన్విజిలేటర్లు పనిచేయగా, 237 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 19 మంది కస్టోడియన్లు విధులు నిర్వర్తించారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులతో కూడిన బృందాలు పరీక్షలను పర్యవేక్షించాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.

ఎస్పీ జగదీష్‌కు డీజీపీ పురస్కారం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర వ్యాప్తంగా ఐపీఎస్ అధికారులకు పోలీసు శాఖ అందిస్తున్న పురస్కారాల్లో భాగంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ డీజీపీ సిల్వర్ డిస్క్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 మంది ఐపీఎస్ అధికారులకు ఈ పురస్కారాలు రాగా జిల్లా ఎస్పీ వీరిలో ఒకరు. జిల్లా స్థాయిలో రాజమహేంద్రవరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ బి.సత్యనారాయణకు డీజీపీ సిల్వర్ డిస్క్ పురస్కారం లభించింది. జిల్లా స్థాయిలో డీజీపీ బ్రోన్జ్ డిస్క్‌కు డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుల్ జి.దుర్గాప్రసాద్, హెడ్ కానిస్టేబుళ్లు సీహెచ్.శ్రీనివాసరావు, ఎం.సత్యకుమార్, కె.గోవర్ధనవరప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుల్స్ ఎల్.ప్రమీల, వి.దీనకుమారి ఎంపికయ్యారు.

నరసన్న కల్యాణం ఆదాయం రూ.20,77,930

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం హుండీల లెక్కింపు ద్వారా స్వామివారికి రూ.20,77,930 ఆదాయం వచ్చింది. దత్త దేవస్థానమైన అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లెక్కింపు జరిగింది. 19 హుండీల ద్వారా రూ.11,12,570, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,37,910, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.3,01,100లతో పాటు, తలనీలాలు, కొబ్బరి చిప్పల ద్వారా మొత్తం రూ.20,77,930 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు, భక్తులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్‌రెడ్డి, కటకం బాబ్జి చిక్కిరెడ్డి భాస్కర్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ముందు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఓఎన్‌జీసీ డైరెక్టర్ రత్నేష్‌కుమార్

బోట్‌క్లబ్: సమాజాభివృద్ధికి ఓఎన్‌జీసీ ఎప్పుడూ ముందుంటుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్ అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల కమర్షియల్ , కంప్యూటర్ ప్రాక్టీసు విభాగానికి ఓఎన్‌జీసీ 15 కంప్యూటర్‌లు, యూపీఎస్, ట్రాలీ సాఫ్ట్‌వేర్‌ను బుధవారం అందించారు. కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ భరతలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు అవకాశాలు అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,000 విరాళం



దాత శ్రీనివాస రంగారావుకు అన్నదానం బాండ్ అందజేస్తున్న ఏఈఓ కృష్ణారావు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన సంక శ్రీనివాస రంగారావు రూ.1,01,000 విరాళాన్ని బుధవారం సమర్పించారు. వీరికి అన్నదానం బాండ్‌ను ఏఈఓ కృష్ణారావు అందజేశారు.

శాసించేది ఆమే..!

- సార్వత్రిక ఎన్నికల్లో నిర్ణయాత్మక శక్తిగా అతివలు
- మహిళా ఓటర్ల చేతిలోనే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల భవితవ్యం
- తూర్పుగోదావరి జిల్లాలో 7 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం
- 7 అసెంబ్లీ స్థానాల్లోనూ మహిళలదే అగ్రస్థానం
- వారిని ప్రసన్నం చేసుకునే పనిలో రాజకీయ నేతలు
- ఇప్పటికే మహిళా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ఎనలేని కృషి



రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి సర్వం సిద్ధమవుతోంది. వైఎస్సార్ సీపీ ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. టీడీపీ, జనసేన, బీజేపీల్లో ఒకటి రెండు స్థానాల్లో మినహా మిగిలినచోట్ల అభ్యర్థులను ఖరారు చేశాయి. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలవుతోంది. మరోవైపు రాజకీయ పార్టీలు మహిళా ఓటర్లకు గాలం వేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు మహిళలను ఆకట్టుకుంటే విజయం తమనే వరిస్తుందన్న భావనతో వారిని ఆకర్షించేందుకు నానా పాట్లు పడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అత్యధికంగా ఉండటం ఇందుకు ఊతమిస్తోంది.

అంతిమ నిర్ణేతలు వారే..

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల వేడి జోరందుకుంది. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం అతివలే అగ్రస్థానంలో నిలిచారు. ఎన్నికల్లో నిర్ణయాత్మక శక్తిగా మారారు. అభ్యర్థుల గెలుపోటములను శాసించారు. తిరిగి త్వరలో జరగనున్న సార్వత్రిక సమరంలో సైతం అతివల ఆధిపత్యమే కొనసాగనుంది. ఓటరు జాబితా సవరణ అనంతరం జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళ ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉండటం గమనార్హం. కేవలం ఓటరు జాబితాలోనే కాకుండా ఓటింగ్‌లో పాల్గొనడంలోనూ అతివలే మేటిగా నిలుస్తున్నారు. ఇందుకు గతంలో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం అధికంగా ఉండటం నిదర్శనంగా నిలుస్తోంది.

విస్తృతంగా కొత్త ఓటర్ల నమోదు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు జిల్లా అధికార యంత్రాంగం తీవ్ర కసరత్తు చేపట్టింది. ఆ దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఓటరు నమోదుకు ప్రత్యేకంగా కియోస్కో యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నగరం , పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో కియోస్క్ యంత్రాలు అందుబాటులో ఉంచింది. ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తూ అధికారులు సామాజిక కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. 'స్వీప్-ఓటరు' పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. బీఎల్‌ఓలను రంగంలోకి దింపారు. వారి పరిధిలో ఉన్న ప్రతి ఒక్క అర్హత కలిగిన ఓటరును నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా యువత ఓటు హక్కు నమోదుకు ముందుకు రావాలని వారిలో చైతన్యం నింపారు. యువతీ, యువకులు సైతం ముందుకు రావడంతో జిల్లాలో రికార్డు స్థాయిలో కొత్త ఓట్లు నమోదు అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఈసారి 45,680 వేలు ఓట్లు పెరిగాయి. జిల్లాలో మొత్తం ఓట్లలో మహిళల హవా నడిచినట్లే కొత్త ఓట్ల నమోదులో కూడా వారిదే అగ్రస్థానం కావడం గమనార్హం. మొత్తం పెరిగిన ఓట్లలో పురుషులు 21,448 మంది, మహిళలు 23,963 మంది ఉన్నారు.

ప్రతిపక్ష పార్టీల ప్రలోభాలు

టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళా అభ్యున్నతికి పాతరేశారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మహిళా సంక్షేమం పేరుతో అతివల ఓట్లు కొల్లకొట్టేందుకు కొత్త పథకం వేస్తున్నారు. తాయిలాలతో లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారు. అయినా గత అనుభవాల దృష్ట్యా మహిళలు టీడీపీని నమ్మే పరిస్థితి లేదు.



ఓటరు కార్డు చూపుతున్న యువతి

జిల్లాలో ఓటర్లు ఇలా..

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా మొత్తం 16,08,504 ఓట్లున్నాయి. పురుషులు 7,85,631, మహిళలు 8,22,779 ఉండగా.. ఇతరులు 94 మంది ఉన్నారు. అందులో అత్యధికంగా మహిళలు ఉన్నారు. వివరాలు ఇలా..

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు
అనపర్తి	1,09,655	1,14,565
రాజానగరం	1,05,910	1,08,479
రాజమహేంద్రవరం సిటీ	1,26,218	1,35,489
రాజమహేంద్రవరం రూరల్	1,32,907	1,39,227
కొవ్వూరు	89,336	93,960
నిడదవోలు	1,03,506	1,08,286
గోపాలపురం	1,18,099	1,22,773

మహిళా సంక్షేమానికి సీఎం జగన్ పెద్ద పీట

మహిళా సంక్షేమం, అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. చేయూత, చేదోడు, జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, సున్నావడ్డీ తదితర పథకాలతో గత నాలుగేళ్లుగా రూ.వేల కోట్ల ఆర్థిక లబ్ధి చేకూరింది. ఫలితంగా చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ గౌరవమైన జీవనం సాగిస్తున్నారు. పెద్ద ఎత్తున సంక్షేమం అందించిన సీఎం వైఎస్ జగన్‌కే వచ్చే ఎన్నికల్లో తిరిగి పట్టం కడతామని ముక్తకంఠంతో చెబుతున్నారు.

ఆ ఫోన్‌కాల్‌పై విచారణ చేయాలి

ఎంపీ భరత్‌రామ్



రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల్లో తనను ఎదుర్కొనే సత్తా లేక టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు నెగిటివ్ ప్రచారానికి దిగాడని, దీనిపై పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ నగరంలోని వంకాయలవారి వీధిలో బ్రాహ్మణ దంపతులకు ఫోన్ చేసి సీఎం జగన్ ప్రియ శిష్యుడినని చెప్పి ఓ వ్యక్తి బెదిరించిన ఘటనపై తమ పార్టీని, తమ నాయకుడి పేరు, తన పేరు ఈ ఫిర్యాదులో ప్రధానంగా పేర్కొనడం వల్ల తాను ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అసలు ఆ దంపతులకు ఫోన్ కాల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు మాట్లాడారు, ఏమి మాట్లాడారు, ఏమని బెదిరించారు, ఫోన్ కాల్ డిటైల్స్ తదితర వివరాలపై సమగ్ర విచారణ చేయాలని పోలీసు శాఖను కోరినట్టు తెలిపారు. ఈ మొత్తం ఎపిసోడ్ వెనుక ఎవరెవరి పాత్ర ఉందనే విషయంపై తనకు పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఆదిరెడ్డి వాసుకు తనపై బురద జల్లే పని తప్పిస్తే, ప్రత్యేకంగా నగరంలో అతని కుటుంబం చేసిన అభివృద్ధి చెప్పుకోవడానికి ఒక్కటి కూడా లేదన్నారు. నగరంలో బ్రాహ్మణులు, మార్వాడీలు తనకు మద్దతు ఇస్తున్నారని, వారిలో తనపై వ్యతిరేకత తీసుకువచ్చేందుకు ఇటువంటి ట్రిక్స్ ప్లే చేస్తున్నాడన్నారు. తన వద్దకు ఎంతో మంది ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసు చర్యల వల్ల ఆర్థికంగా, మానసికంగా నలిగిపోయిన వారు వచ్చారని, తమ ఆవేదనలు చెప్పుకున్నారన్నారు. అటువంటి వీడియోలు రిలీజ్ చేయాలంటే చాలా ఉన్నాయన్నారు.

సమన్వయంతో లక్ష్య సాధన

- రబీ ధాన్యం కొనుగోలుపై శిక్షణ
- జిల్లాలో 231 కేంద్రాలు
- 3.20 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు ప్రణాళిక
- కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రస్తుత 2023–34 రబీ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధర కలిపించే విధంగా రైతుల నుంచీ కొనుగోళ్లు చేపట్టడం కోసం సమన్వయం సాధించడంలో అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. బుధవారం శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో మార్కెటింగ్, పౌర సరఫరాలు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బందికి రబీ సీజన్లో ధాన్యం కొనుగోలు విధానం పై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో రైతు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర అందించే విధంగా అధికారులు కృషి చేయాలని అన్నారు. పంటను పొలం వద్ద నుంచీ, కొనుగోలు కేంద్రాలకు, అక్కడ నుంచి మిల్లర్ల వద్దకు తీసుకు వచ్చే క్రమంలో వివిధ దశల్లో చేయవలసిన పనులు, అంశాలపై ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. రైతులకు, మిల్లర్లకు మధ్య దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, అధికారుల ప్రమేయంతోనే ధాన్యం కొనుగోలు జరిగే విధంగా చూడాలని ఆమె అన్నారు. రైతులు కోతలు కోసి కుప్పలు వేసిన తరువాత ధాన్యాన్ని బస్తాలకు ఎత్తే సమయంలో వారికి గోనెసంచులు, హమాలీల కొరత లేకుండా ముందుగానే జాగ్రత్త వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు ఎన్ని గోనె సంచులు అవసరం అవుతాయో ముందుగానే వారి వద్ద తెలుసుకోవాలి అనారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున మిల్లుల వద్ద రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా చూడాలి అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ధాన్యం సేకరణ సమయంలో శాంపిల్స్, వాటి విశ్లేషణ, పాటించాల్సిన ప్రమాణాలు, తేమ శాతం, వ్యర్థాల శాతం, తదితర అంశాలపై శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే సమయంలో సాంకేతిక పరమైన డేటా ఎంట్రీ, ట్రిప్ షీట్, తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ్, రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.చైత్ర వర్షిణి, పౌర సరఫరాల డీఎం టి.రాధిక, డీఎస్‌వో పి.విజయభాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందస్తు కార్యాచరణ

కలెక్టర్ మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నియోజకవర్గాల వారీగా ఎన్నికల నిర్వహణ, సిబ్బందికి శిక్షణ తదితర అంశాలపై ముందస్తు కార్యాచరణ అందజేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అధికారులను ఆదేశించారు. బుధవారం వెలగపూడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆర్వోలతో కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ నామినేషన్లు ఏప్రిల్ 18 నుంచి ఏడు రోజులపాటు స్వీకరించి, తదుపరి ఎన్నికల ప్రక్రియకు సన్నద్ధం కావలసి ఉంటుందన్నారు. నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించాల్సిన పనులను, శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న ఫారమ్ 7,8ల పరిష్కారం, నామినేషన్ ప్రక్రియ ముగిసే వరకు ఫారం 6 స్వీకరణ ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ముందుగా ప్రిసైడింగ్ అధికారి (పీఓ), ఏపీఓ, ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతుల నిర్వహణకు సదుపాయాలు అందుబాటులో ఉన్నాయో లేదో ఆర్వోలు తనిఖీ చేయాలని ఆదేశించారు. సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదును సకాలంలో పరిష్కరించడం, వివిధ తనిఖీ బృందాలు విధుల్లో జవాబుదారీతనం, కచ్చితత్వం కలిగి ఉండడం చాలా ముఖ్యం అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఆర్ఓ, జేసీ తేజ్‌భరత్, రాజమహేంద్రవరం అర్బన్ ఆర్ఓ కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్ఓ సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, డీఆర్ఓ నరసింహులు పాల్గొన్నారు.

కదన రంగం... కాకినాడ తీరం

- ఉత్సాహంగా భారత, అమెరికా సంయుక్త విన్యాసాలు
- గాలిలో జెట్ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు చక్కర్లు
- సముద్ర జలాల్లో యుద్ధ నౌకల్లో శత్రువులకు దడ పుట్టించే విన్యాసాలు
- పాల్గొన్న త్రివిధ దళాలు, అమెరికా రక్షణ శాఖ అధికారులు



సాగర జలాల్లో యుద్ధ నౌకపై భారత్, అమెరికా దళాలు



కదన రంగంలోకి దూకేలా.. యుద్ధ నౌకలో సిద్ధంగా ఉన్న సైన్యం



యుద్ధ నౌక నుంచి బయటకు భారీ వాహనాలు, తీరానానికి చేరుకునేలా..



భారత్, అమెరికా విన్యాసాలలో భాగంగా హెలికాప్టర్‌తో నేవీ జీపు తరలింపు

కాకినాడ రూరల్: సముద్ర మార్గం నుంచి భారత భూభాగంలోకి చొచ్చుకు వచ్చే శత్రు సైన్యం, ఉగ్రవాదులను కట్టడి చేసే లక్ష్యంగా మనదేశ రక్షణ దళాలు, అమెరికా రక్షణ దళాల సంయుక్త విన్యాసాలు కాకినాడ తీరంలో శత్రువులకు దడ పుట్టించేలా కొనసాగుతున్నాయి. టైగర్ ట్రాయంఫ్ – 2024 విన్యాసాల పేరిట విశాఖపట్నంలో ఈ నెల 18న ఇరుదేశాల విన్యాసాలు ప్రారంభమయ్యాయి. దీనికి కొనసాగింపుగా కాకినాడ సీ ఫేజ్‌లో విన్యాసాలు నిర్వహిస్తున్నారు. రెండు దేశాల రక్షణ దళాల సామర్థ్యాలను మెరుగుపరిచే విధంగా సాగుతున్న విన్యాసాలతో కాకినాడ సాగర తీరం కదన రంగాన్ని తలపింపజేస్తోంది. గాల్లో పెద్ద శబ్దాలు చేస్తూ జెట్ యుద్ధ విమానాలు, తీరం వద్ద హెలికాప్టర్ చక్కర్లు, ఒడ్డును యుద్ధ ట్యాంకులు, సాగర జలాల్లో యుద్ధ నౌకలు, అత్యాధునిక ఆయుధాలతో భారత సైన్యంలో నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆర్మీ దళాల నుంచి సుమారు 700 మంది మోహరించడంతో కాకినాడ తీరం యుద్ధ క్షేత్రాన్ని తలపింజేస్తుంది. కాకినాడ రూరల్ సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్ పరిధిలో ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్ వద్ద భారత్ త్రివిధ దళాలు ఉభయ చర సామర్థ్యం ప్రదర్శిస్తున్నాయి. సముద్ర తీరంలో యుద్ధ నౌకలపై విన్యాసాలతో పాటు ఒడ్డున చేపడుతున్నారు. బహుళ డ్రోన్‌లు, యాంటీ డ్రోన్ పరికరాలు, పదాతిదళం, మెకనైజ్డ్ పదాతి దళం, పారా ఎస్ఎఫ్, ఆర్టిలరీ, ఇంజనీర్లు, ఇతర సహాయక ఆయుధాలతో ఆర్మీ బృందం ప్రాతినిధ్యం వహిస్తుండగా, నేవీ అత్యాధునిక యుద్ధ నౌకలను రంగంలోకి దించింది. భారత్, అమెరికా దేశాలు సిబ్బంది పరస్పర అవగాహన, సహకారం పెంపొందించుకునేలా ఒకరి నౌకలను మరొకరు సందర్శించుకుంటూ స్నేహపూర్వకంగా విన్యాసాలు చేపడుతున్నాయి. విన్యాసాలలో ప్రధానంగా సముద్ర దశ, ఒక అనుకరణ ద్వీప దేశానికి వ్యూహాత్మక తరలింపు, షిప్ టు షోర్ తరలింపు, ఉభయ చర కార్యకలాపాలతో నైపుణ్యం ప్రదర్శించడం విన్యాసాలలో ముఖ్య భాగం. బుధవారం ఉదయం నేవీ యుద్ధ విమానం కాకినాడ నగరం, రూరల్ గ్రామాల పరిధిలో చక్కర్లు కొట్టింది. సైనిక సిబ్బంది ఏరియల్ వ్యూ నిర్వహించారు. విమానం నుంచి పెద్ద శబ్దం వినిపించడంతో చూసేందుకు జనాలు ఇండ్లలో నుంచి బయటకువచ్చారు. మధ్యాహ్నం సూర్యారావుపేట బీచ్‌లో విశాఖపట్నం నుంచి అమెరికా రక్షణ దళ అధికారులతో కూడిన హెలికాప్టరు చక్కర్లు కొట్టింది. ఉదయం, సాయంత్రం విన్యాసాలు చేపట్టారు. అయితే విన్యాసాలు చూసేందుకు ఉత్సాహంగా వస్తున్న ప్రజలకు నిరాశే ఎదురయ్యింది. మీడియా, పబ్లిక్‌ను కూడా విన్యాసాల వద్దకు అనుమతించలేదు. బీచ్ రోడ్డును మూసి వేసి పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు భారత్, అమెరికా సంయుక్త విన్యాసాలు కొనసాగుతాయని నేవీ అధికారులు తెలియజేశారు.

బేరింగ్ మరమ్మతులకు చర్యలు

కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు: గోదావరిపై నిర్మించిన నాలుగో వంతెన 57,58 స్పాన్‌ల మధ్య దెబ్బతిన్న పిల్లర్ బేరింగ్‌ల మార్పిడి పనులు సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. బుధవారం అధికారులతో ఆమె వంతెనపై బేరింగ్‌లు దెబ్బతిన్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బేరింగ్‌లు రీ ప్లేస్ చేయడానికి తయారు చేసే కంపెనీలకు కొత్తగా బేరింగ్‌లకు ఆర్డర్ ఇచ్చామన్నారు. పనులు పూర్తయ్యేంత వరకు ట్రాఫిక్‌కి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్ అండ్ బీ వంతెన నిర్వహణ చూస్తున్న పాత్ సంస్థ ప్రతినిధులు ఇచ్చిన నివేదిక ప్రకారం బేరింగ్‌లు దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సాంకేతిక పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా ఏ రకమైన బేరింగ్‌లు ఏర్పాటు చేయాలో అంచనా వేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే బేరింగ్ నమునా తయారు చేసినట్లు తెలిపారు. పుణే, బోపాల్‌లో ఆ బేరింగ్ తయారు చేసే సంస్థలను గుర్తించి ఆర్డర్ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. బేరింగ్‌ల తయారీకి పదిరోజులు, ఏర్పాటు చేయడానికి నాలుగైదు రోజులు పాటు సమయం పడుతుందని అంచనా వేస్తున్నారని తెలిపారు. రెండు వారాల్లో పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. గోదావరి బ్రిడ్జి లిమిటెడ్ (ఆర్ జీబీఎల్) చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ ఏ సీహెచ్ ఖురేషి, నేషనల్ హైవే ఈఈ సురేంద్రబాబు, ఈఈ ఆర్‌డీసీ ఎ.శ్రీకాంత్, లసా కన్సల్టెంట్ సీనియర్ బ్రిడ్జి తనిఖీ నిపుణులు జేవీఆర్ రెడ్డి, మురళీధర్, ఆర్‌జీబీఎల్ సీనియర్ ఇంజినీర్ ఆశిష్ కుమార్ ,సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మండపేట: ద్వారపూడి – కేశవరం రైల్వే స్టేషన్ల మధ్య కేశవరం రైల్వేగేటు సమీపంలో బుధవారం వందేభారత్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 30 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడి ఒంటిపై ఎరుపు, నలుపు రంగుల గళ్ల చొక్కా, ఖాకీ రంగు షార్ట్ ఉన్నాయి. ఈ ఘటనపై రాజమహేంద్రవరం జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ స్టేషన్ నంబర్ 0883 2442821, జీఆర్పీ ఎస్సై 94910 03239 నంబర్లకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

కాలువలో జారిపడి..

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గుబ్బాలమ్మ ఆలయం వద్ద రేవులో కాళ్లు శుభ్రం చేసుకుంటున్న వ్యక్తి ప్రమాదవశాత్తూ కాలువలో జారిపడి మృతి చెందాడు. సమిశ్రగూడెం ఎస్సై రమేష్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన సుంకవల్లి చల్లారావు (43) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 26వ తేదీన గుబ్బాలమ్మ గుడి వద్ద ఉన్న కాలువ రేవులో కాళ్లు శుభ్రం చేసుకుంటుండగా జారిపడి గల్లంతయ్యాడు. అనంతరం కాలువలో మృతదేహం లభ్యమైంది. భార్య సత్యసూర్యనాగు ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

జగ్గంపేట: రామవరం శివారులో జాతీయ రహదారిని దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు ఉంటుంది. మంగళవారం అర్ధరాత్రి అతడు రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. అతడి ఒంటిపై నీలంగళ్ల చొక్కా, జీన్ ప్యాంట్ ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు జగ్గంపేట పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై నాగార్జునరాజు కోరారు.

చికిత్స పొందుతూ ..

చాగల్లు: మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై పి. నాగరాజు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన ఎల్లే ఇజ్రాయేలు (73) ద్విచక్ర వాహనంపై మంగళవారం తన గ్రామం నుంచి నిడదవోలు వైపు బయలుదేరాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ అతడిని బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇజ్రాయేలు తలకు తీవ్ర గాయమైంది. అతడిని వెంటనే కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇజ్రాయేలు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్షా కాలం



- ఏప్రిల్ 6 నుంచి వార్షిక పరీక్షలు
- సిద్ధమవుతున్న 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు

రాయవరం: వేసవి కాలం వచ్చేసింది. ఎండలు క్రమేపీ ముదురుతున్నాయి. ఉష్ణోగ్రతలతో పాటు విద్యార్థుల్లో పరీక్షల వేడి కూడా మొదలైంది. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకూ వార్షిక పరీక్షలు ఏప్రిల్ 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 1 నుంచి 5 తరగతులకు ఏప్రిల్ 6వ నుంచి 16వ తేదీ వరకూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తారు. అలాగే 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఏప్రిల్ 6 నుంచి 19వ తేదీ పరీక్షలు జరుగుతాయి. వీరిలో 6 నుంచి 8 తరగతుల విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తొమ్మిదో తరగతి విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ పరీక్షలు రాస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సీబీఏ విధానంలో, 9వ తరగతికి సీబీఎస్‌ఈ విధానంలో పరీక్షలు జరుగుతాయి. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మాత్రం పాత విధానంలోనే నిర్వహిస్తారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిధిలో చదువుతున్న 1,83,613 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

జిల్లాలో పాఠశాలలు

జిల్లాలో 2,036 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1,580 ప్రభుత్వ యాజమాన్య పరిధిలో, 456 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1 నుంచి 5 తరగతులకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో 42,014 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 56,313 మంది చదువుతున్నారు. 6–9 తరగతులకు చెందిన 55,006 మంది విద్యార్థులు, 30,280 మంది ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు.

ప్రశ్నాపత్రాల పంపిణీకి చర్యలు

మండల విద్యాశాఖ కార్యాలయాలకు ప్రశ్నాపత్రాలను చేర్చే పనిలో జిల్లా కామన్ ఎగ్జామ్ బోర్డు(డీసీఈబీ) నిమగ్నమైంది. ఈనెల 30వ తేదీ నాటికి మండల కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను పూర్తి స్థాయిలో పంపించే అవకాశం ఉంది. ఆయా పాఠశాలల హెచ్ఎంలు వాటిని సరి చూసుకుని ఎమ్మార్సీలో భద్రపర్చుకోవాలి. పరీక్షల ప్రారంభం నుంచి సంబంధిత ప్రశ్నాపత్రాల బండిళ్లను ఏరోజుకారోజు పరీక్షకు గంట ముందు ఎమ్మార్సీల నుంచి హెచ్ఎంలు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

టైం టేబుల్ విడుదల

పరీక్షల నిర్వహణకు ఎస్సీఈఆర్టీ టైమ్ టేబుల్ విడుదల చేసింది. పరీక్షల నిర్వహణ అనంతరం ఏప్రిల్ 21వ తేదీలోగా జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు సూచించారు. ఏప్రిల్ 23న ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అందజేయడంతో పాటూ తరగతి వారీగా ప్రమోషన్ జాబితాలు సిద్ధం చేయాలి.

ఒకటి నుంచి ఐదు తరగతులకు..

1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు 6న తెలుగు, 8న ఇంగ్లిషు, 10న ఇంగ్లిష్ పార్ట్–బి (టోఫెల్), 12న గణితం, 13న పరిసరాల విజ్ఞానం పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానమైన పరీక్షలు 13తో ముగుస్తాయి. 15న ఓఎస్ఎస్సీ, 16న 4వ తరగతి విద్యార్థులకు మాత్రం స్టేట్ లెవల్ ఎచీవ్‌మెంట్ సర్వే (స్లాష్) పరీక్షను నిర్వహించనున్నారు.

ఆరు నుంచి తొమ్మిది తరగతులకు..

6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు 6న తెలుగు, 8న హిందీ, 10న ఇంగ్లిషు పార్ట్–ఎ, 12న ఇంగ్లిషు పార్ట్–బి (టోఫెల్), 13న గణితం, 15న ఒకటి నుంచి ఎనిమిది తరగతులకు జనరల్ సైన్స్, 9వ తరగతికి ఫిజికల్ సైన్స్, 16న బయలాజికల్ సైన్స్, 18న సోషల్ స్టడీస్, 19న 8, 9 తరగతులకు కాంపోజిట్ కోర్సులు/ఓఎస్ఎస్సీ1 అండ్ 2 పరీక్షలు, అదే రోజు 6,7 తరగతులకు పేపర్–1, పేపరు–2 పరీక్షలు నిర్వహిస్తారు.

పారదర్శకంగా..



‘పదో తరగతి పబ్లిక్ పరీక్షల మాదిరిగానే ఈ వార్షిక పరీక్షలను నిర్వహించాలి. ఎటువంటి అపోహలకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో జరపాల్సిన బాధ్యత హెచ్ఎంలపై ఉంది. ఎటువంటి అవకతవకలు, లోపాలు చోటుచేసుకున్నా సంబంధిత హెచ్ఎంలు, ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

పరీక్షా పత్రాల పంపిణీకి ఏర్పాట్లు



పరీక్షా పత్రాల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షలు రాతపూర్వక విధానంలోనే నిర్వహిస్తున్నాం. ఎస్సీఈఆర్టీ నిబంధనల ప్రకారం పరీక్షలను పాఠశాల స్థాయిలో పక్కాగా నిర్వహించాలి.’

– బి.హనుమంతురావు, డీసీఈబీ సెక్రటరీ, అమలాపురం.

అధ్యాపకులూ నిత్య విద్యార్థులే



మాట్లాడుతున్న నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: సాంకేతిక విజ్ఞానానికి అవసరమైన వివిధ అంశాలపై అవగాహన కల్పించడం కోసం యూనివర్సిటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. మూడ్ల్స్ లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ఫర్ టీచర్స్ ప్రొఫెషనల్ గ్రోత్ అండ్ గ్లోబల్ రికగ్నేషన్‌పై బుధవారం ఫ్యాకల్టీ ట్రైనింగ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అధ్యాపకులు కూడా ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడంలో నిత్య విద్యార్థులేనన్నారు. రీసోర్స్‌పర్సన్, జేఎన్‌టీయూకే మ్యాథమెటిక్స్ హెచ్‌ఓడీ వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ మూడ్ల్స్ అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా ఆన్‌లైన్ టీచింగ్ పద్ధతులను మెరుగుపర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ చెస్ పోటీలకు సాత్విక్



అమలాపురం టౌన్: హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఈనెల 29వ తేదీ నుంచి ఏప్రిల్ 5 వరకూ జరిగే జాతీయ చెస్ పోటీల్లో పాల్గొనేందుకు అమలాపురం విక్టరీ అకాడమీ విద్యార్థి ద్రాక్షారపు సాత్విక్ బుధవారం బయలుదేరి వెళ్లాడు. గత జనవరిలో విజయ నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో సాత్విక్ సత్తా చాటి, జాతీయ టీమ్ చెస్ ఛాంపియన్ షిప్‌నకు ఎంపికయ్యాడని అకాడమీ ప్రిన్సిపాల్ తాడి వెంకట సురేష్ తెలిపారు. సాత్విక్ వివిధ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి చెస్ పోటీల్లో తొమ్మిది సార్లు పాల్గొన్నాడు.

శతాధిక వృద్ధురాలి మృతి



దాకారపు సీతమ్మ (ఫైల్)

అల్లవరం: మండలంలోని దేవగుప్తం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు దాకారపు సీతమ్మ (102) బుధవారం మృతి చెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సీతమ్మకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని పలువురు సందర్శించి, నివాళులర్పించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించాలి

- జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు
- ఇన్నోవేషన్ ఫెయిర్ ప్రారంభం



ఇన్నోవేషన్ ఫెయిర్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించి, సరికొత్త ఆవిష్కరణలు చేయాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. యూనివర్సిటీలో రెండు రోజుల పాటు డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఇన్నోవేషన్ ఫెయిర్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజానికి, రైతులకు, ఇతర రంగాలకు ఉపయోగపడేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రాజెక్టులు రూపొందించడం సంతోషకరమన్నారు. నన్నయ్య వర్సిటీ వీసీ డాక్టర్ కొప్పిరెడ్డి పద్మరాజు మాట్లాడుతూ ఇటువంటి సదస్సులో పాల్గొనడం ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను పంచుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. పరిశోధన, కొత్త ఆవిష్కరణలకు వేదికగా జేఎన్‌టీయూ డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ నిలిచిందన్నారు. గిరిజనులకు బైక్ అంబులెన్స్, తేమ నుంచి నీటి ఉత్పత్తి వంటి పలు ప్రతిష్టాత్మమైన ప్రాజెక్టులను జేఎన్‌టీయూకే డైరెక్టర్ గోపాలకృష్ణ రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసలు పొందారన్నారు. అనంతరం డైరెక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వీసీలు ప్రసాదరాజు, పద్మరాజులను సత్కరించారు. కార్యక్రమంలో ఓఎస్డీ కోటేశ్వరరావు, రిజిస్ట్రార్ సుమలత, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీ కుమార్తెలపై యాచకుడి దాడి



సీసీ కెమెరాల్లో రికార్డయిన యాచకుడు



యాచకుడి దాడిలో గాయపడిన బాలిక

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో తల్లీ కుమార్తెలపై యాచకుడు దాడి చేసిన సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ఒక యాచకుడు బుధవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి భిక్ష మెత్తుకుంటున్నాడు. ఒక ఇంటి వద్ద ముల్ల రవీనా అనే మహిళ భిక్ష వేసేందుకు బయటకు రాగా అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె భయంతో ఇంట్లోకి పరుగులు తీసి తలుపులు మూసుకుంది. కొద్దిసేపటికి మళ్లీ బయటకు రాగా అక్కడే మాటు వేసిన ఆ యాచకుడు ఇంట్లోకి ప్రవేశించాడు. రవీనాతో పాటు ఆమె రెండేళ్ల కుమార్తె సహస్రపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చాడు. రవీనా గట్టిగా కేకలు వేసేసరికి అక్కడి నుంచి పరారయ్యాడు. దాడికి గురైన రవీనా గర్భిణి. స్థానికంగా ఒక ఇంటిలో ఉన్న సీసీ ఫుటేజీ ద్వారా లభ్యమైన యాచకుడి ఫొటోను గ్రామస్తులు పోలీసులకు అందించారు. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవునికి బంగారు ధ్వజస్తంభం



సత్యదేవుని ఆలయంలో ప్రస్తుత ధ్వజస్తంభం



పంపా సత్రం వద్ద ఉంచిన నూతన స్తంభం కర్ర

- రూ.నాలుగుకోట్లతో ఏర్పాటుకు సన్నాహాలు
- నేడు పాత స్తంభం తొలగింపునకు పూజలు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామివారి ఆలయంలో నూతన బంగారు ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభం తొలగింపు పనులకు గురువారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 8.08 గంటలకు ధ్వజ స్తంభం కళాప్రకర్షణ కార్యక్రమాన్ని పండితులు నిర్వహిస్తారు. ప్రస్తుత ధ్వజస్తంభం కలశలను ఉపసంహరించి భద్రపరుస్తారు. అనంతరం ఆ కర్రను తొలగించే పని ప్రారంభమవుంది. రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తవుతాయి.

ఏప్రిల్ 22న నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఏప్రిల్ 18వ తేదీ నుంచి నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలు మొదలవుతాయి. 22వ తేదీ ఉదయం శాస్త్రోక్తంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుంది. సత్యదేవుని ఆలయంలో సుమారు 50 ఏళ్ల క్రితం ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం కర్ర పుచ్చిపోయి శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని గమనించిన దేవస్థానం వైదిక కమిటీ నూతనంగా ప్రతిష్ఠించాలని గత ఏడాది ఆగస్టులో అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్‌కు నివేదిక సమర్పించింది. దీంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

రూ.నాలుగు కోట్ల వ్యయం

నెల్లూరుకు చెందిన ఒక దాత రూ.నాలుగు కోట్లతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు, దానిపై బంగారు రేకు తాపడం చేసేందుకు ముందుకు వచ్చారు. బంగారు రేకు తాపడానికి సుమారు మూడు కేజీలు బంగారం అవసరమని అంచనా వేశారు. రాగి రేకు తయారు చేసి దానిపై బంగారు పూత పూస్తారు. బంగారు రేకు తయారీ పనులు కూడా చురుకుగా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

అన్నవరం చేరిన నారప కర్ర

నూతన ధ్వజస్తంభానికి అవసరమయ్యే నారప జాతికి చెందిన 64 అడుగుల కర్రను గుంటూరు జిల్లా తెనాలిలోని టింబర్ డిపోలో గత అక్టోబర్‌లో అప్పటి దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్, నెల్లూరుకు చెందిన దాత, దేవస్థానం వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, ప్రస్తుత డిప్యూటీ ఈఓ రమేష్ బాబు, విశ్రాంతి స్థపతి ప్రసాద్ ఎంపిక చేశారు. దానిని ధ్వజస్తంభం రూపంలో తయారు చేసి, దేవస్థానంలోని పంపా సత్రానికి తరలించారు. కాగా.. ధ్వజస్తంభం కళా ప్రకర్షణ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్, వేదపండితులు, ఇతర సిబ్బంది పాల్గొంటారని అధికారులు తెలిపారు.

భూమి పేరుతో జనసేన నాయకుడి మోసం

- రూ.40 లక్షలు తీసుకుని దళిత మహిళకు బెదిరింపులు
- కేసు నమోదు చేసిన పోలీసులు

తాళ్లపూడి: దళిత మహిళను మోసం చేసిన ఘటనలో తాడిపూడికి చెందిన జనసేన మండల అధ్యక్షుడు గంటా శివరామకృష్ణపై తాళ్లపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై టి.శ్యామ్ సుందర్ తెలిపిన వివరాల ప్రకారం తణుకు పట్టణానికి చెందిన బాడ్డల సూర్యకుమారికి ఆమె భర్త మరణానంతరం బీమా సొమ్ము రూ.40 లక్షలు వచ్చాయి. ఆ తర్వాత ఆమెకు వేగేశ్వరపురం గ్రామంలోని మేరీమాత ఆలయం వద్ద గంటా శివరామకృష్ణ పరిచయం అయ్యాడు. మాటల క్రమంలో సుర్యకుమారి వద్ద బీమా సొమ్ము ఉందని తెలుసుకున్నాడు. గోపాలపురం మండలం భీమోలులో భూమి కొనిస్తానని చెప్పి ఆమె దగ్గర రూ.40 లక్షలు తీసుకున్నాడు. అనంతరం భూమి కొనుగోలు చేసినట్టు ఆమె పేరుపై నకిలీ పాస్ బుక్ సృష్టించి ఇచ్చాడు. అయితే తాను మోసపోయినట్టు గ్రహించిన సూర్యకుమారి ఈ విషయంపై శివరామకృష్ణను నిలదీసింది. దీంతో అతడు ఆ రూ.40 లక్షలు మరచిపోవాలని లేదంటే చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు తాళ్లపూడి పోలీసులను ఆశ్రయించింది. కాగా.. గంటా కృష్ణ అనారోగ్యంతో రాజమహేంద్రవరంలోని ఒక ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నాడని సమాచారం. అలాగే అతడు ఆత్మహత్యాయత్నం చేయడంతో ఆస్పత్రిలో చేర్చారని స్థానికులు చెబుతున్నారు.

టీడీపీలో రెండో రోజూ కొనసాగిన మూకుమ్మడి రాజీనామాలు

రాజీనామా చేసిన పార్టీ అనుబంధ సంఘాల కమిటీ అధ్యక్షులు



తమ రాజీనామా లేఖను చూపుతున్న టీడీపీ అనుబంధ సంఘాల కమిటీ ప్రతినిధులు

అనపర్తి: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి బదులు బీజేపీ అభ్యర్థి బరిలో నిలుస్తారన్న ప్రచారంపై టీడీపీ అధిష్టానం స్పందించకపోవడంపై బుధవారం రెండో రోజు టీడీపీ నియోజకవర్గ అనుబంధ సంఘాలకు చెందిన వివిధ కమిటీ అధ్యక్షులు తమ పదవులకు రాజీనామా చేశారు. దీనికి సంబంధించి బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ పెదపూడి మండలం ఎస్సీ సెల్ కన్వీనర్ మందపల్లి సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ టీడీపీ అధిష్టానం అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించిన మొదటి జాబితాలోనే అనపర్తి ఎమ్మెల్యే సీటు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి కేటాయించారని, తదనంతరం పొత్తుల్లో భాగంగా బీజేపీకి కేటాయించారన్న ప్రచారంపై పార్టీ అధిష్టానం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదని అన్నారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పార్టీ పొత్తుల్లో భాగంగా రామకృష్ణారెడ్డికి కాకుండా వేరే పార్టీకి టికెట్ ఇస్తే ఓటమి ఖాయమన్నారు. టికెట్ కేటాయింపు విషయంలో టీడీపీ అధిష్టానం స్పష్టతనివ్వకపోవడంపై నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో గల పార్టీ అనుబంధ సంఘాల కమిటీ అధ్యక్షులు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ఒకటిన బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో ఏప్రిల్ ఒకటిన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తెలిపారు. రెండేళ్ల కాలవ్యవధితో కూడిన బీఈడీ కోర్సు చేయాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీ ఎడ్‌సెట్ 2023 రాసిన వారు అర్హులని, వివరాలకు 70930 08473 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రేపు శ్రీషిర్డీసాయిలో టెన్త్ విద్యార్థులకు సదస్సు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని శ్రీ షిర్డీసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం టెన్త్ విద్యార్థులకు అవగాహన సదస్సు, మెగా స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు దివాన్‌చెరువులోని బీజాపురి క్యాంపస్‌లో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్‌తో పాటు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ నీట్, ఎయిమ్స్, ఐసీ, మాట్, క్లాట్, సివిల్స్ వంటి ఇంటిగ్రేటెడ్ కోర్సులపై నిపుణులు అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. అనంతరం పరీక్ష నిర్వహించి అర్హులైన వారందరికీ ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ కోరారు. మరిన్ని వివరాలకు 95812 61119 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

దోనె తిరగబడి రైతు మృతి

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన వేగి రాజు (46) చెరువు దాటుతుండగా ప్రమాదవశాత్తూ దోనె తిరగబడి మృతి చెందాడు. తాను కౌలుకు తీసుకున్న పొలానికి వెళ్లడానికి బుధవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక కామయ్యకురుడు చెరువు వద్దకు వెళ్లాడు. దోనె ఎక్కి చెరువును దాటుతుండగా తిరగబడడంతో చెరువులో మునిగి మృతి చెందాడు. రాజుకు తల్లి, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై తమకు సమాచారం అందలేదని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు.

ఆయిల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



ఆయిల్ ఫ్యాక్టరీలో ఎగసిపడుతున్న మంటలు

రాజానగరం: చక్రద్వారబంధంలోని ప్రైవేట్ ఆయిల్ ఫ్యాక్టరీలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఏడాది కాలంగా మూసి వేసిన ఈ ఫ్యాక్టరీని తిరిగి పునఃప్రారంభించేందుకు గాను మరమ్మతులు చేస్తున్నారు. ఇందులో భాగంగా వెల్డింగ్ పనులు చేస్తుండగా నిప్పురవ్వలు సమీపంలోని బాయిలర్‌లో పడటంతో ఈ ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే సుమారు రూ.35 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి టి.శ్రీనివాస్ తెలిపారు. ప్రమాదం తెలిసిన వెంటనే రాజమహేంద్రవరం, అనపర్తి అగ్నిమాపక కేంద్రాల నుంచి మూడు వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఉండ్రాజవరం: గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పాలంగి చెక్ పోస్ట్ వద్ద బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై వి.అప్పలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పాలంగి గ్రామంలో ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా తణుకు బైపాస్ రోడ్డు నుంచి ఉండ్రాజవరం వైపు వెళుతున్న ఇద్దరు పోలీసుల చూసి పారిపోబోయారు. వారిని పట్టుకుని తనిఖీ చేయగా, రెండు ప్లాస్టిక్ కవర్లలో కట్టిన 11 కేజీల గంజాయి లభించింది. నిందితులు కేరళ రాష్ట్రానికి చెందిన పి.రాజీవ్ రవి, కె.సుల్ఫికర్ అని, వారిద్దరూ కాకినాడలో ఉంటున్నారన్నారు. పాడేరు నుంచి తీసుకు వచ్చిన గంజాయిని ఉండ్రాజవరం పరిసర ప్రాంతాలల్లో విక్రయించాలని ఇక్కడకు వచ్చారన్నారు. వారి నుంచి గంజాయి, రెండు సెల్ ఫోన్లు, రూ.500 స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించామన్నారు.